క్లుప్తంగా

పేద యువతి వివాహానికి ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందిస్తున్న యువ కేర్ ప్రతినిధులు

మార్కాపురం రూరల్: మార్కాపురం పట్టణంలో పేద ముస్లిం యువతి వివాహానికి యువ కేర్ స్వచ్ఛంద సంస్థ తరఫున 20,500 రూపాయల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. తమ సంస్థ తరఫున సేకరించిన సొమ్మును యువతి తల్లిదండ్రులకు అందించినట్లు అధ్యక్షుడు ఆరీఫుద్దీన్ తెలిపారు. కార్యక్రమంలో హుస్సేన్‌సాబ్, కరీముల్లా, ఇమ్రాన్, మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు


జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ఆక్రమణల తొలగింపు ఆదివారం కూడా కొనసాగింది. వివిధ ప్రాంతాల్లో మున్సిపల్ కాలువలపై ఏర్పాటు చేసిన బంకులు, దుకాణాలు, రేకులషెడ్లు తొలగించారు. అయ్యప్పస్వామి గుడికి సమీపంలో ఉన్న ఆక్రమణలను ఆదివారం జేసీబీతో కూల్చివేశారు. కాగా పట్టణంలోని మెయిన్‌బజారు, అమ్మవారిశాల, తేరు బజారు, నాయుడు బజారులో పలువురు తమ ఇళ్ల ముందు ఉన్న మెట్లు, బంకులు, రేకులను స్వచ్ఛందంగా తొలగించారు. గాంధీ పార్కు తూర్పువైపున ఉన్న ప్రహరీ గోడను కూల్చివేసి ఇనుప గ్రిల్స్‌ను తొలగించారు.

ఆదిశంకరాచార్యులుకు నూతన రజత మకరతోరణం


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కందుల, బ్రాహ్మణ ప్రముఖులు

మార్కాపురం: స్థానిక మార్కండేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలోని జగద్గురు ఆది శంకరాచార్యుల వారికి ఆదివారం నూతన రజత మకర తోరణం, రజత సర్వజ్ఞ పీఠాలను అలంకరించారు. ఆది శంకరాచార్యులు వారి ఉపాలయ దశాబ్ది మహోత్సవంలో భాగంగా దాతల సహకారంతో చేయించిన తోరణం, పీఠాన్ని భక్తుల జయజయ ధ్వానాలు, వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య అంతరాలయానికి చేర్చారు. ముందుగా ఆలయంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, ఈఓ చెన్న కేశవరెడ్డి తదితరులు పూజల్లో పాల్గొన్నారు. బ్రాహ్మణ సంఘాల ప్రముఖులు గోపాలుని హరి హరరావు, పురాణం సుబ్రహ్మణ్యం, సోమయాజుల సుబ్బశాస్త్రి, కమలాపురి శ్రీనివాస్, హరి, కాశంరాజు శ్యాంసుందరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం బ్రాహ్మణ అన్న సంతర్పణ నిర్వహించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తర్లుపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భూలక్ష్మి అధ్యక్షతన సోమవారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్ తెలిపారు. జెడ్పీటీసీ సభ్యురాలు వెన్నా ఇందిరతోపాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు తమ శాఖ ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

ఇదేమి చోద్యం..
ఎలా చేయాలి సేద్యం?

- పంటల బీమా ప్రీమియం రైతులే కట్టుకోవాలట!
- వైఎస్సార్ సీపీ హయాంలో రైతుల వాటా ప్రభుత్వమే చెల్లింపు
- కూటమి ప్రభుత్వ తీరుపై రైతుల అసహనం


సాగవుతున్న వరి

మార్కాపురం:

పంటల బీమాపై రైతులకు ధీమా కల్పించి, సాగును ప్రోత్సహించాల్సిన కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. బీమా ప్రీమియం చెల్లింపు బాధ్యత తమది కాదు రైతులదేనంటూ ప్రకటించడంపై తీవ్ర స్థాయిలో విమర్శలొస్తున్నా సర్కారు వెనక్కి తగ్గడం లేదు. బీమా ప్రీమియంలో రైతులు తమ వాటా చెల్లించాలని ఇప్పటికే వ్యవసాయాధికారులను పురమాయించి క్షేత్ర స్థాయిలో ప్రభుత్వం ప్రచారం చేయించినా ఆశించిన స్పందన రాలేదు. దీంతో బీమా ప్రీమియం చెల్లింపు గడువునూ ప్రభుత్వం పెంచుకుంటూ వస్తోంది.

అప్పుడు అలా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్సార్ పంట బీమా పథకం కింద రైతుల ప్రీమియం వాటాను ప్రభుత్వమే చెల్లించింది. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులకు అదే సీజన్‌లో నష్టపరిహారం అందించి వ్యవసాయాన్ని పండగలా మార్చిన ఘనత నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది. అదే సమయంలో నాణ్యమైన ఎరువులు, పురుగు మందులతోపాటు సాంకేతిక సలహాలను గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లోనే అందించి వ్యవసాయ రంగానికి దన్నుగా నిలిచారు.

ఇప్పుడు ఇలా..

తాము అధికారంలోకి వస్తే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20 వేలు అందిస్తామని ఇచ్చిన హామీని కూటమి నేతలు అటకెక్కించారు. దాంతోపాటు రైతుల బీమా పథకానికి కూడా మంగళం పాడారు. పరిహారం కావాలంటే రైతులే తాము సాగుచేసిన పంటకు బీమా నగదు చెల్లించాలనే షరతు విధించడంతో వ్యవసాయం మళ్లీ భారంగా మారింది. కూటమి ప్రభుత్వ తీరు రైతులకు మింగుడుపడటం లేదు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కురిసిన అకాల వర్షాలతో పత్తి రైతులు దిగాలు పడిపోయారు. రబీకి సన్నద్ధమవుతున్న పరిస్థితుల్లో అన్నదాత సుఖీభవ పథకం లేకపోగా, పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించుకోవాలని ప్రభుత్వం చెప్పడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు.

రబీ సీజన్ ప్రారంభం

మార్కాపురం ప్రాంతంలో రబీ సీజన్ ప్రారంభమైంది. రైతులు పప్పుశనగ, మినుము, మిర్చి పైర్లు సాగుచేస్తున్నారు. పప్పుశనగను మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పెద్దారవీడు, కంభం, అర్ధవీడు తదితర మండలాల్లో సాగుచేస్తున్నారు. మినుముపంటను ఇప్పటికే తర్లుపాడు గిద్దలూరు, బేస్తవారిపేట, కంభం, అర్ధవీడు, కొమరోలు, రాచర్ల, యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు తదితర మండలాల్లో సుమారు 400 హెక్టార్లలో సాగు చేశారు.

పంట పేరు	బీమా ప్రీమియం(హెక్టారుకు)
పప్పుశనగ	రూ.920
వరి	రూ.538
జొన్న	రూ.149
మినుములు	రూ.256
మిర్చి	రూ.1313
మొక్కజొన్న	రూ.263

నోట్ : వరి బీమా ప్రీమియం గడువు డిసెంబర్ 31 కాగా మిగిలిన పంటలకు డిసెంబర్ 15లోగా ప్రీమియం సొమ్ము చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

ప్రభుత్వమే చెల్లించాలి



పంటల బీమా పథకంలో రైతుల వాటా నగదును ప్రభుత్వమే చెల్లించాలి. ఇప్పటికే రైతులు పంటలు సాగుచేసి గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో బీమా నగదును రైతులు చెల్లించడం భారమవుతుంది. ఈ నిర్ణయంపై పునరాలోచన చేసి రైతుల వాటాను ప్రభుత్వమే చెల్లించాలి.

– గాలి వెంకటరామిరెడ్డి, రైతు సంఘం నేత

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న కొండారెడ్డి

మార్కాపురం: మార్కాపురం ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం పార్టీ ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో సీపీఎం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ రాయవరం సమీపంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేయాలని, ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కాలేజీని నిర్వహించాలని కోరారు. వెలుగొండ ప్రాజెక్టు మిగులు పనులను పూర్తి చేయడంతోపాటు నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ అందజేయాలని డిమాండ్ చేశారు. మార్కాపురం పరిసర ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని, పలకల పరిశ్రమను ఆదుకోవాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాలకు సాగర్ నీటిని అందించాలని విజ్ఞప్తి చేశారు. మార్కాపురం పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. గొర్రెలు, మేకల పెంపకందారులకు ప్రభుత్వం భూమిని కేటాయించాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు డి.సోమయ్య, డీకేఎం రఫీ,రాజశేఖర్‌రెడ్డి, బాల శేషయ్య పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ


మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం టౌన్: విద్యార్థులకు ఎన్‌సీసీతో క్రమశిక్షణ అలవడుతుందని మార్కాపురం సీఐ సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక కమలా హైస్కూల్లో ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎన్‌సీసీలో చేరి దేశ సేవ చేయాలని కోరారు. ముందుగా జాతీయ జెండాను ఎగురవేసి కవాతు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కరస్పాండెంట్ పి.పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ స్వరూప్ రంజన్, కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎంపీ పులయ్య, ఎన్‌సీసీ ఏఎన్‌ఓ శ్రీకాంత్, పీటీ రజనీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో..

జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ దినోత్సవాన్ని 186 సీవోవై ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, డీన్ డాక్టర్ మస్తానయ్య, సీఎస్‌ఈ హెచ్‌ఓడీ డాక్టర్ సాదు నాయక్ జెండా ఆవిష్కరించారు. ఎన్‌సీసీ క్యాడెట్ల పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కార్తీక వనభోజనాలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి


కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులు


సామూహిక అభిషేకాల్లో పాల్గొన్న గౌడ సంఘ నాయకులు

మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో ఆదివారం కార్తీక మాస వనభోజన మహోత్సవాలు ఉత్సాహంగా సాగాయి. వివిధ సామాజిక వర్గాల ఆధ్వర్యంలో పర్యాటక ప్రదేశాలు, ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ప్రముఖులు పాల్గొని ఉపన్యసించారు.

సమాజ అభివృద్ధిలో రెడ్లు భాగస్వాములు కావాలి

బేస్తవారిపేట: సమాజ అభివృద్ధిలో రెడ్డి సోదరులు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పోలేరమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన రెడ్డి కుటుంబ సభ్యుల కార్తీక వనభోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. సమాజం అన్ని విధాలుగా బాగుండేలా చూసే బాధ్యత రెడ్డి సోదరులపై ఉందని, వందల సంవత్సరాలు పాలించిన రెడ్డి రాజులు మనకు చూపించిన మార్గంలో నడవాలని కోరారు. రెడ్డి కుటుంబ సభ్యులు పోలేరమ్మ ఆలయం, కాశేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో యోగి వేమన రెడ్డి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో..

కంభం: కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో కంభం చెరువుకట్టపై ఆదివారం కార్తీక వన భోజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువుకట్టపై సామూహిక సత్యనారాయణ స్వామివ్రతం నిర్వహించారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో కాకతీయ సేవాసమితి కార్యదర్శి ముప్పవరపు వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి బోయపాటి వెంకటేశ్వర్లు, కొండయ్య, గని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో..

మార్కాపురం: మార్కాపురం గౌడ సంఘం 10వ కార్తీక వనభోజనాలు ఆదివారం పట్టణ శివారులోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి కొండ వద్ద ఘనంగా నిర్వహించారు. ముందుగా లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు రంగస్వామి గౌడ్ మాట్లాడుతూ.. గౌడ సంఘం కోసం పట్టణంలో రూ.35 లక్షలతో 51 సెంట్ల భూమిని కొనుగోలు చేశామని పేర్కొన్నారు. త్వరలో భవన నిర్మాణం చేపడతామని, దాతలు సహకరించాలని కోరారు. అనంతరం అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష్య కార్యదర్శులు గజ్జ రమణగౌడ, దొంత లక్ష్మయ్య, గౌరవ సలహాదారు కేవీ నరసింహారావు, కోశాధికారి కంచర్ల నాగార్జున, కొమరా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..

మార్కాపురం రూరల్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని వెలుగొండ ప్రాజెక్టు సమీపంలోని ముద్దసానమ్మ అమ్మవారి ఆలయంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. వాసవీ క్లబ్ కుటుంబ సభ్యులు సుమారు 1000 మంది పాల్గొన్నారు. కార్యక్రమాలను వాసవీక్లబ్ ప్రెసిడెంట్ గార్లపాటి రామకృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు సముద్రాల రమేష్‌కుమార్, సెక్రటరీ బచ్చు ప్రభాకర్, పాదర్తి హరిబాబు తదితరులు పర్యవేక్షించారు.


మాట్లాడుతున్న సుబ్బారావు


సభ్యులను అభినందిస్తున్న వాసవీ క్లబ్ నిర్వాహకులు


సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న కమ్మ సంఘీయులు

గాండ్ల సామాజికవర్గం ఐక్యంగా ఉండాలి

పొదిలి: గాండ్ల సామాజిక వర్గం ఐక్యంగా ఉండటం ద్వారా సమస్యలు పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందని గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోసు సుబ్బారావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గోశాలలో పొదిలి యూనిట్ అధ్యక్షుడు చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావు అధ్యక్షతన గాండ్ల కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. నూనెలు తయారు చేసే సామాజిక వర్గం తమదని గర్వంగా చెప్పుకోవచ్చని, ఎవరైనా నూనెల తయారీ గానుగలు పెట్టాలనుకునే వారు తనను సంప్రదించాలని సూచించారు. ఏటా వనభోజనాలు ఏర్పాటు చేస్తున్న సంఘ ప్రధాన కార్యదర్శి దాసరి గురుస్వామిని అభినందించారు. ముందుగా శివపార్వతుల శాంతి కళ్యాణం నిర్వహించారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సంఘ నాయకులు తంగెళ్ల నాగభూషణం, చిట్టెంశెట్టి వెంకట సుబ్బారావు, బట్టు రామారావు, వరికుంట్ల వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు తిరుపతి హరగోపాల్, వరికుంట్ల రాజా, చిట్టెంశెట్టి శ్రీనివాసులు, భీమవరపు సహదేవుడు, గుంటక కృష్ణ, ఊటుకూరి ప్రసాద్, వరికుంట్ల వెంకటేశ్వర్లు, హనుమంతరావు, రోషన్‌బాబు, అనూష, సురేష్ రాగవీన, నలబోలు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గాలిగోపురం చుట్టూ పక్షుల ప్రదక్షిణ

- వింతగా చూస్తున్న ప్రజలు


గాలిగోపురం చుట్టూ తిరుగుతున్న పక్షులు

మార్కాపురం: చరిత్ర కలిగిన మార్కాపురంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి గాలిగోపురం చుట్టూ రెండు రోజుల నుంచి వివిధ రకాల పక్షులు ఉదయం పూట ప్రదక్షిణ చేసినట్లుగా తిరుగుతున్నాయి. ఈ దృశ్యాన్ని స్థానికులు సెల్‌ఫోన్లలో రికార్డు చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. పక్షుల ప్రదర్శనను ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. విచిత్రంగా కొన్నిరకాల పక్షులు ఉదయం 8 గంటల సమయంలో మాత్రమే గాలిగోపురం చుట్టూ ప్రదక్షిణగా నాలుగైదు సార్లు తిరుగుతున్నాయి. చెన్నకేశవస్వామి ఆలయాన్ని శ్రీ కృష్ణ దేవరాయలు నిర్మించారు.

27న సామూహిక రుద్ర పూజలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కాశినాయన కుంట సమీపంలో గల శ్రీరామకృష్ణ ధ్యాన మందిరంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ ఉదయం 6.30 గంటల నుంచి 8 గంటల వరకు సామూహిక రుద్ర పూజలు నిర్వహించనున్నట్లు ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ సంఘ సేవకులు బీఎస్ నారాయణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా సామూహిక రుద్రపూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నామన్నారు. తీర్థప్రసాదాలతోపాటు అల్పాహారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా రామాలయ వార్షికోత్సవం


కలశాల ఊరేగింపులో ఉభయదాతలు

పొదిలి: స్థానిక కాలేజీ రోడ్డులోని సీతారామచంద్ర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ పునఃనిర్మాణ ఉభయదాత వేంపాటి పోలిరెడ్డి, రమణమ్మ దంపతుల ఆధ్వర్యంలో కలశాలు ఊరేగించారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మహిళలు కలశాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారికి అభిషేకాలు, హోమ పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను తిలకించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అల్పాహారం పంపిణీ చేశారు.

యూటీఎఫ్
పట్టణ నూతన కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన యూటీఎఫ్ కమిటీ సభ్యులు

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని యుటీఎఫ్ కార్యాలయంలో పట్టణ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.శ్రీరాములు, ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి ప్రభాకర్ వ్యవహరించారు. గౌరవ సలహాదారులుగా డి.కొండయ్య, పి.అంకమ్మ, గౌరవ అధ్యక్షుడిగా తాటిపర్తి సత్యనారాయణరెడ్డి, అధ్యక్షుడిగా సి.కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, బేబిరాణి, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీనివాసరెడ్డి, కోశాధికారిగా డి.నాగఫణీంద్ర బాబు, జిల్లా కన్వీనర్లుగా రవికుమార్, ఎ.శేష యోగయ్య, కె.లక్ష్మీదేవి, కుటుంబ సంక్షేమ పథకం కన్వీనర్‌గా ఎం.శ్రీనివాస నాయక్, పీఎస్ కన్వీనర్‌గా వి.అల్లూరయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వి.రాజేష్, బీ.చెన్నారెడ్డి, వై.పాపయ్య, పీ.వెంకటేశ్వర్లు, పి.వి జయలక్ష్మి, యలమందారెడ్డి, కె.వెంకటేశ్వర్లు, ఎస్.శంకరరావు, మల్లీశ్వరి, వై.లక్ష్మి, ఏలియా, వి.శ్రీనివాసులరెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

మార్కాపురం పట్టణంలోని మున్సిపల్ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలని మున్సిపల్ స్కూళ్ల ఉపాధ్యాయులు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. యూపీలో ఉన్న ఎస్జీటీ పోస్టులను స్కూల్ అసిస్టెంట్‌గా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ తయారుచేసిన ఫైల్‌ను మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్‌కు అందజేయాలని ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓవీ వీరారెడ్డి, జిల్లా మున్సిపల్ ఉపాధ్యాయుల కన్వీనర్ రవి కుమార్, జిల్లా కౌన్సిలర్ పి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో ముద్దసానమ్మ అమ్మవారు


ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి


ప్రత్యేక అలంకారంలో అల్లూరి పోలేరమ్మ


కాలేజీ రోడ్డులో పూజలందుకుంటున్న పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్: స్థానిక అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారి మూలవిగ్రహమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేశారు. ఆలయ పరిసరాల్లోని పుట్ట, నాగ శిలలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, చైర్మన్, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే స్థానిక కాలేజీ రోడ్డులోని పోలేరమ్మ ఆలయంలో అర్చకుడు అమర్నాథ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

ముద్దసానమ్మ ఆలయంలో..

మార్కాపురం రూరల్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని జమ్మనపల్లి గ్రామ సమీపంలో ముద్దసానమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మార్కాపురం పట్టణంతోపాటు పలు గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.